క్లుప్తంగా

ఉపాధి పనులపై సమీక్ష

కృత్తివెన్ను: గ్రామాల్లో ఉపాధి పనులు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా జరగాలని ఏపీడీ భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం కృత్తివెన్ను ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం అధికారులు, ఎఫ్‌ఏలతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈసీ హర్షవర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ పత్రాలపై అవగాహన

కోడూరు: సొంత భూమి లేని కౌలుదారులకు ప్రభుత్వం అందిస్తున్న పంట సాగుదారు హక్కు (సీసీఆర్‌సీ) పత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ ఎం.శ్రీధర్ అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద రైతులకు సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన సదస్సు నిర్వహించారు. భూయజమానికి, సాగుదారునికి మధ్య ఈ పత్రాలు ఒప్పంద పత్రాలుగా ఉంటాయని, వీటి కాల పరిమితి జారీ చేసిన నాటి నుంచి 11 నెలల పాటు ఉంటుందని ఏఓ తెలిపారు. పత్రాలు ఉన్న కౌలు రైతులు కూడా ప్రభుత్వ పథకాలు అందుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ఆన్‌లైన్ చేసి పలువురు రైతులకు పత్రాలను అందించారు. ఏఈఓ సురేష్, వీఆర్వో వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ తిమ్మన నాంచారయ్య, వీఏఏ మరియాంబి పాల్గొన్నారు.

మూగజీవాలకు టీకాలు




మోపిదేవి: ప్రతి ఏడాది ఆగస్ట్, సెప్టెంబర్ నెలలో మూగ జీవాలకు వ్యాపించే నీలి నాలుక (బ్లూ టంగ్)కు ముందస్తుగానే వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నామని మండల పశు వైద్యాధికారి డాక్టర్ ఎం. నందకిషోర్ తెలిపారు. మోపిదేవి వెటర్నరీ కేంద్రం వద్ద బుధవారం గొర్రెలు, మేకలకు బ్లూ టంగ్ టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ మోపిదేవి వెటర్నరీ కేంద్రం కింద సుమారు 4 వేల మూగ జీవాలు ఉన్నాయని, అందులో బుధవారం 1,300 జీవాలకు పైగా టీకా వేశామని చెప్పారు. ముందస్తుగా టీకా వేయడం వల్ల బ్లూ టంగ్ వ్యాధిన పడకుండా మూగజీవాలను కాపాడుకోవచ్చునని వివరించారు.

విద్యా సంస్థల బంద్ ప్రశాంతం

మచిలీపట్నంటౌన్: దళిత జేఏసీ జిల్లా కమిటీ పిలుపు మేరకు బుధవారం నగరంలోని విద్యా సంస్థల బంద్ ప్రశాంతంగా ముగిసింది. నోబుల్ కాలనీలోని వసతిగృహంలో ఉంటూ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న యువతిపై సామూహిక అత్యాచారం, హైనీ విద్యాసంస్థల కరస్పాండెంట్ జోయల్ ప్రసన్న కుమార్‌పై మెకానిక్ వీరబాబు నడిరోడ్డుపై దాడి చేసిన ఘటనలకు నిరసనగా దళిత జేఏసీ నాయకులు బంద్‌కు పిలుపునిచ్చారు. కృష్ణా యూనివర్సిటీతో పాటు నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలు మూతపడ్డాయి. దళిత జేఏసీ జిల్లా అధ్యక్షుడు జక్కుల ఆనందబాబు మాట్లాడుతూ ఈ ఘటనలలో నిందితులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జేఏసీ జిల్లా కార్యదర్శి బేతపూడి రవి, దళిత జేఏసీ కోశాధికారి కొడమంచిలి చంద్రశేఖర్, నాయకులు బందెల థామస్‌నోబుల్ తదితరులు పాల్గొన్నారు.

30 సిమెంటు బల్లల ఏర్పాటు



గూడూరు: గూడూరు పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన సిమెంటు బల్లలను ఎంపీపీ సంగా మధుసూదనరావు బుధవారం ప్రారంభించారు. సర్పంచి లింగం సులోచనారాణి ఆధ్వర్యంలో గ్రామంలో జనసంచారం అధికంగా ఉండే వివిధ కూడళ్లలో 30 సిమెంటు బల్లలను ఏర్పాటు చేశారు. ఉప సర్పంచి డిసా దివ్యభారతి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

బంటుమిల్లి: అర్తమూరు గ్రామ దేవత గంగానమ్మ స్థలం వద్ద బుధవారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కొంత కాలంగా ఈ స్థలంపై ఇరువర్గాల మధ్య వివాదాలు చోటుచేసుకున్నాయి. పరిస్థితులు విషమించడంతో స్పందించిన రెవెన్యూ అధికారులు గంగానమ్మ స్థలంలో వేసిన రేకుల షెడ్డును తొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు.

యూబీఐ పీఓలకు శిక్షణ

పెడన: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రొబేషనరీ అధికారులు (పీఓలు) బుధవారం చెన్నూరు రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఈ క్రాప్ బుకింగ్, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల పంపిణీ, వ్యవసాయ యాంత్రీకరణ, పంటల బీమా, ధాన్యం కొనుగోలు, కౌలు రైతుల గుర్తింపు తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించారు. పెడన ఏఓ జీవీ శ్రీనివాసరావు, మచిలీపట్నంలోని పట్టాభి ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ విజయభారతి, వి. ప్రవీణ్ పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి యోగా దోహదం

- న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య
- ఘనంగా అంతర్జాతీయ యోగా డే



బందరులో యోగాసనాలు వేస్తున్న న్యాయమూర్తులు, సిబ్బంది



బందరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆసనాలు వేస్తున్న దృశ్యం



నందమూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



నాగాయలంకలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

చిలకలపూడి(మచిలీపట్నం): సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదపడుతోందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా న్యాయమూర్తులు, న్యాయశాఖ సిబ్బంది యోగాసనాలను వేశారు. న్యాయమూర్తి మాట్లాడుతూ యోగాసనాలు ప్రతిరోజు వేయడం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులను దూరం చేయవచ్చునన్నారు. ప్రతి ఒక్కరూ యోగాసనాలు క్రమం తప్పకుండా వేస్తే మానసికంగా కూడా ఉల్లాసంగా ఉంటారని చెప్పారు. పలువురు న్యాయమూర్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో...

స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా స్థాయి యోగా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఆయుష్ శాఖ ద్వారా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎంయూడీఏ చైర్‌పర్సన్ బొర్రా నాగదుర్గా భవానీ మాట్లాడుతూ యోగా ద్వారా శారీరక, మానసిక రుగ్మతలు తొలగుతాయన్నారు. కృష్ణా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఝాన్సీ లక్ష్మీ, డీవైఈఓ యూవీ సుబ్బారావు, డీఎస్పీ మాధవరెడ్డి, త్రినాథ్‌బాబు, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్‌రావు పాల్గొన్నారు.

కృష్ణా విశ్వవిద్యాలయంలో...

కృష్ణా విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ కళాశాల, రసాయన శాస్త్ర విభాగం ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. బాబురెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా యోగాసనాలు వేయడం ద్వారా మెరుగైన ఆరోగ్యం పొందవచ్చునన్నారు. అధ్యాపకులు జి. రవి, కె. సీతాలు, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ సన్వార్ సింగ్ పాల్గొన్నారు.

మానసిక వికాసానికి తోడ్పాటు

పెడన: యోగా శారీరక, మానసిక వికాసానికి తోడ్పడుతోందని శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ఎస్ రెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాలలో యోగా ట్రైనర్ టి. రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాలను వేశారు. కళాశాల కరస్పాండెంట్ కుమార్‌బాబు, డైరెక్టర్ బాబా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోపిదేవి గురుకుల పాఠశాలలో..

మోపిదేవి: యోగా సాధన ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె. వీర రవి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మోపిదేవి గురుకుల పాఠశాలలో బుధవారం విద్యార్థులచే యోగా చేయించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా అందరూ యోగా చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగాయలంకలో..

నాగాయలంక: ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో విద్యా భారతి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. సంస్థ ఏపీ కార్యదర్శి డాక్టర్ ఏవీఎల్ నారాయణ, జిల్లా ఆరోగ్య భారతి సభ్యుడు సనకా శ్రీనివాసరావు మాట్లాడుతూ యోగా ఉపయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల కరస్పాండెంట్ ఆకుల వెంకట రత్నారావు, అకడమిక్ డైరెక్టర్ ఏపీ శేషుబాబు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తలగడదీవిలో..

మండలంలోని తలగడదీవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయుడు యోగాసనాలు వేశారు. ఎన్‌సీసీ అధికారి కొమ్మినేని ఉదయకుమార్, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం బచ్చు రాఘవరావు మాట్లాడుతూ ప్రాణాయామం, యోగా సాధనతో నూతనోత్తేజం కలిగి పాఠ్యాంశాలపై విద్యార్థులు పట్టు సాధిస్తారన్నారు. పద్యాల రఘురామయ్య, పీఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యవంతమైన జీవితం

మచిలీపట్నంటౌన్: యోగాతో ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యమవుతుందని యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ కె. వెంకట్రావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమాన్ని స్థానిక రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న పట్టాభి గ్రామీణ శిక్షణా సంస్థ ఆవరణలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన పలు యోగాసనాలు వేసి మాట్లాడారు. శిక్షణా సంస్థ డైరెక్టర్ విజయభారతి, తదితరులు పాల్గొన్నారు. నగరంలోని యోగేశ్వర్ శ్రీ రాంలాల్ యోగిని సంస్థాన్ ఆధ్వర్యంలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. యోగా శిక్షకురాలు సుంకర దుర్గాభవాని యోగా ఉపయోగాలను వివరించారు. ఇందుపల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో బుధవారం యోగా దినోత్సవాన్ని నిర్వహించి యోగసనాలు వేయించారు. ఈ సందర్భంగా శిక్షకులు దుర్గాభవానిని ఘనంగా సత్కరించారు.

బంటుమిల్లిలో..

బంటుమిల్లి: స్థానిక కాంతి కేంద్రం సేవా ట్రస్ట్ భవనంలో యోగా గురువులు ఏవీ రమణ, ఎ. శేషు మాస్టారు ఆధ్వర్యంలో సూర్య నమస్కారాలు, ధ్యాన, యోగ సాధన చేశారు. అనంతరం యోగా గురువులను సత్కరించారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్. జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ యోగా ఉపయోగాలు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బీడీ జయరాజు, జ్యోత్స్న, సుజాత, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

రోజూ యోగా సాధన మేలు

చల్లపల్లి: ప్రతి రోజు యోగా సాధనతో మానసిక ప్రశాంతత, ఆరోగ్యం లభిస్తాయని సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీలో సర్పంచ్ కృష్ణకుమారి, పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు యోగాసనాలు వేశారు. పురిటిగడ్డ జెడ్పీ హైస్కూల్‌లో యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు యోగాసనాలు వేశారు. హెచ్‌ఎం కేబీఎస్ శర్మ, ప్రముఖులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో మెరుగుపడిన జీవనం

లబ్ధిదారుల ఆనందం



పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరిస్తున్న పేర్ని కిట్టు

చిలకలపూడి(మచిలీపట్నం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో మా జీవనం మెరుగుపడిందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తంచేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండల పరిధిలోని కానూరు గ్రామంలో బుధవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ఇచ్చే పథకాలతో మా జీవన విధానం మెరుగుపడిందని, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తోడ్పాటును అందిస్తున్నారని చెప్పారు. అనంతరం పేర్ని కిట్టు మాట్లాడుతూ పేదలంతా ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని వివరించారు. జగనన్న సురక్ష పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి కూడా పథకాలు చేరువ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ చక్కా ఏడుకొండలు, వైఎస్సార్ సీపీ నాయకులు గోపు మురళి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో గ్రాడ్యుయేషన్ డే

కృత్తివెన్ను: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంతో పాటు పాఠశాల విద్యకు అనుగుణంగా వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దుతామని జెడ్పీటీసీ మైలా రత్నకుమారి అన్నారు. మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. కృత్తివెన్ను అంగన్‌వాడీ కేంద్రంలో జెడ్పీటీసీ మాట్లాడుతూ అంగన్‌వాడీ నుంచి ప్రాథమిక పాఠశాలలకు వెళుతున్న చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. సీడీపీఓ సముద్రవేణి, ఎంపీటీసీ విజయకుమారి పాల్గొన్నారు.

నేడు స్వామివారి హుండీ కానుకల లెక్కింపు

మోపిదేవి: సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలను గురువారం ఉదయం 8 గంటలకు లెక్కిస్తామని ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో జరిగే హుండీ కానుకల లెక్కింపులో ఆసక్తిగల భక్తులు డ్రెస్‌కోడ్‌లో పాల్గొనవచ్చునని చెప్పారు. హుండీ లెక్కింపు వల్ల స్వామివారి నిత్య శాంతి కల్యాణం ఉదయం ఏడు గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

క్విజ్‌లో జెడ్పీహెచ్ఎస్ బాలికల ప్రతిభ



విజేతలకు సర్టిఫికెట్లు అందించిన హెచ్‌ఎం, నిర్వాహకులు



గెలుపొందిన విద్యార్థులతో యోహాన్ తదితరులు

నాగాయలంక: మండల స్థాయి క్విజ్ పోటీల్లో జెడ్పీ హైస్కూల్‌కు చెందిన అమ్మల సుమశ్రీ (పదో తరగతి), మత్తి వెంకట లిప్సిక (తొమ్మిదో తరగతి) ప్రథమ స్థానంలో నిలిచి రూ. ఐదు వేల నగదు బహుమతితో పాటు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం వనమా రామకృష్ణ బుధవారం తెలిపారు. భారతీయ రిజర్వు బ్యాంక్, ఏపీ ఆర్థిక సమీకృతం, అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు చేపట్టిన ఆల్ ఇండియా స్కూల్ క్విజ్ -2023 పోటీల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో మండల స్థాయి క్విజ్ పోటీ జరిగింది. మండలంలోని ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి ఇద్దరు చొప్పున ఐదు జట్లుగా పది మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన ఇద్దరు బాలికలు త్వరలో జరిగే కృష్ణా జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో నాగాయలంక మండలం నుంచి ప్రాతినిధ్యం వహిస్తారు. ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.3 వేలు, వెయ్యి రూపాయల చొప్పున నగదు బహుమతులు ప్రకటించారు. విజేతలకు సర్టిఫికెట్లను హెచ్‌ఎం చేతుల మీదుగా అందజేశారు. నగదు బహుమతులను విద్యార్థుల ఖాతాకు జమ చేస్తామని ఈ కార్యక్రమానికి సారథ్యం వహించిన స్థానిక ఇండియన్ బ్యాంక్ మేనేజర్ అజయ్‌కుమార్ తెలిపారు.

- **పెడన:** స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బుధవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. పెడన బీజీకే జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. పెనుమల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ద్వితీయ. చేవేంద్ర జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు. వీరికి వరుసగా రూ. 5 వేలు, రూ. 4 వేలు. రూ. 3 వేల నగదు బహుమతులను అందజేస్తామని పెడన యూనియన్ బ్యాంక్ మేనేజర్ వెలువల యోహాన్ తెలిపారు. కార్యక్రమంలో ఎండీ ఉస్మాన్‌బాషా, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- **బంటుమిల్లి:** రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. పెందుర్రు జెడ్పీహెచ్‌స్ విద్యార్థులు పి. జాహ్నవి, ఎల్. ఉషశ్రీ, అర్తమూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు పి. దీపిక, జి. ప్రభుతేజ, బంటుమిల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు కె. శ్రీవల్లి, జె. బాల రాజమణికంఠలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

నగదు ప్రోత్సాహకాలతో పోటీతత్వం పెంపు



ఆణిముత్యాలను సన్మానించిన ఎంపీపీ వాణి

పెడన: పది, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించడం ద్వారా కింది తరగతులలోని వారిలో పోటీతత్వం పెరుగుతుందని పెడన ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. నందమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలకు నగదు పురస్కారం అందజేశారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు మట్టా దివ్య, జోగి నాగదుర్గ ఉదయభార్గవి, మోతుకూరి నీలిమలను సన్మానించి నగదు పురస్కారాలను రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాలలను అభివృద్ధి చేయడమే కాకుండా ఇంగ్లిష్ మీడియంలో విద్యా బోధన నేర్పించేలా పటిష్ట చర్యలు చేపట్టారని వివరించారు. మాజీ ఎంపీపీ రాజులపాటి అచ్యుతరావు, సర్పంచ్ పరసా నరసింహారావు, ఎంపీటీసీ ఉదయకుమార్, హెచ్‌ఎం ప్రభాకరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జగనన్న సురక్ష సర్వే

పెడన: జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం చేయాలని, గృహ సారథులు ఈ విషయంలో ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌ఓ రాజశేఖర్ అన్నారు. స్థానిక వీరభద్రపురం కల్యాణ మండలంలో 3, 4 వార్డు సచివాలయాల పరిధిలోని గృహ సారథులు, వలంటీర్లకు, సచివాలయ కన్వీనర్లకు జగనన్న సురక్షపై సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. రాజశేఖర్ మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీ నుంచి ఇంటింటికి వెళ్లి సర్వే చేయాల్సి ఉంటుందని వివరించారు. వైస్ చైర్మన్ బైలపాటి జ్యోతి, ఆయా వార్డు కౌన్సిలర్లు కటకం ప్రసాద్, కటకం నాగకుమారి, లక్ష్మీనరసమ్మ, సచివాలయాల కన్వీనర్ మతీన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి..

చల్లపల్లి: ప్రజలకు 11 రకాల సేవలు ఉచితంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం చేయాలని తహసీల్దార్ కె.గోపాలకృష్ణ కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సన్నాహక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈఓపీఆర్డీ బూరేపల్లి అశోక్, సీనియర్ అసిస్టెంట్ ఘంటసాల కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌కు మరమ్మతులు

కోడూరు: మండలంలోని విద్యుత్ ఎక్స్‌ప్రెస్ లైన్‌కు ఆ శాఖాధికారులు మరమ్మతులు చేపట్టారు. ఎక్స్‌ప్రెస్ లైన్‌కు సంబంధించిన కండక్టర్లు దెబ్బతినడంతో వాటి స్థానంలో నూతన కండక్టర్లను ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం ఉల్లిపాలెం వద్ద విద్యుత్ స్తంభాలపై కండక్టర్లను సిబ్బంది ఏర్పాటు చేశారు. మరో మూడు రోజుల పాటు మరమ్మతు పనులు కొనసాగుతాయని డీఈ ఎస్.సుబ్రహ్మణేశ్వరరావు తెలిపారు. దీంతో ఉల్లిపాలెం, వేణుగోపాలపురం గ్రామాల చెరువులతో పాటు పాలకాయతిప్ప, హంసలదీవి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం..

అవనిగడ్డలోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో గురువారం కోడూరు మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

సీసీఆర్సీ కార్డులతో మేలు

గూడూరు: ప్రభుత్వం జారీ చేస్తున్న సీసీఆర్సీ కార్డులతో కౌలు రైతులు ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని గూడూరు తహసీల్దార్ బి.విజయప్రసాద్ అన్నారు. సీసీఆర్సీ కార్డులపై అవగాహన సదస్సు మల్లవోలులో బుధవారం నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ పొలం యజమానులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం కౌలు రైతు కార్డులు జారీ చేస్తోందని వివరించారు. ఎంపీడీఓ డి.సుబ్బారావు, సర్పంచి బొర్రా సాంబశివయ్య, ఎంపీటీసీ సభ్యులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

- **పెడన:** కౌలు రైతులు కౌలు కార్డులు పొందడం వల్ల భూ యాజమానులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని, భూ యాజమానులు పూర్తి సహకారం అందించాలని పెడన ఏఓ జీవీ శ్రీనివాసరావు అన్నారు. చెన్నూరు, చేవేంద్ర గ్రామాల్లోని కౌలు రైతులకు, భూ యాజమానులకు సమావేశాలను నిర్వహించి అవగాహన కల్పించారు. భారతి, రాజు, రైతులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఈ-స్టాంపింగ్ లైసెన్స్ కేంద్రం ప్రారంభం



ఈ-స్టాంప్‌ను ప్రదర్శిస్తున్న మండలి హనుమంతరావు

గుడివాడ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఈ-స్టాంపింగ్ విధానం వలన ప్రజలకు ఆర్థికంగా లాభం చేకూరడంతో పాటు సమయం కలసి వస్తుందని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మండలి హనుమంతరావు అన్నారు. బుధవారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం ఎదురుగా గల జండు కార్యాలయంలో డిజిటల్ ఈ- స్టాంపింగ్ విధానాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజలు రూ.100, రూ.50, రూ.20, రూ.10 విలువగల నాన్ జ్యుడిషియల్ స్టాంపుల కొరకు నానా ఇబ్బందులు పడాల్సివచ్చేదన్నారు. ప్రభుత్వం జండు సంస్థకు ఈ-స్టాంపింగ్ లైసెన్స్ మంజూరు చేసిందన్నారు. దీని వలన వెంటనే స్టాంప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఈ విధానం వలన రిజిస్ట్రేషన్, బ్యాంక్ రుణాలు, ఇతర ఆర్థిక సంబంధమైన లావాదేవీలకు సమయంతో పాటు డబ్బుకూడా కలసివస్తుందన్నారు. జండు యజమాని డి.ఉమాకుమార్, సయ్యద్ గఫార్, నందూరి భద్రీనాథ్, బీఎస్‌బీ మాళి తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల ఆర్థికాభివృద్ధికి కృషి

చలసాని ఆంజనేయులు

చిలకలపూడి(మచిలీపట్నం): పాల ఉత్పత్తిదారుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నామని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. బందరు మండలం జొన్నలవారిపాలెంలో బుధవారం పాల ఉత్పత్తిదారులతో ఆయన సమావేశమయ్యారు. పాల ఉత్పత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆంజనేయులు మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి కృష్ణా మిల్క్ యూనియన్ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రతి నాలుగు నెలలకు బోనస్ పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఉచితంగా పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి జలగ మందును అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు అర్జా నగేష్, గుడ్లవల్లేరు పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, జొన్నల లక్ష్మీఈశ్వరి, చొప్పకట్ల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- **పెడన:** పెడన మండలం అచ్చయ్యవారిపాలెం పాల సహకార సంఘాన్ని కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ ఆంజనేయులు బుధవారం సందర్శించి పాల ఉత్పత్తిదారులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని పలు సందేహాలను నివృత్తి చేశారు. సంఘ సభ్యులు అర్జా వెంకట నగేష్, మేనేజర్ తోట సత్యనారాయణ, జొన్నల వీర వెంకట సత్యనారాయణ, వరప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో గ్రామ సభ

కృత్తివెన్ను: మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామం రైతు భరోసా కేంద్రంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఏఓ జెన్నీ మాట్లాడుతూ కౌలు రైతులను గుర్తించి కౌలు కార్డుల ఉపయోగాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వారికి అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని చెప్పారు.
అర్హులైన రైతులకు పంట సాగు హక్కు పత్రం కోసం దరఖాస్తు చేసే విధానాన్ని వివరించారు. రాయితీపై వరి విత్తనాలు సరఫరా చేస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ సుబ్రహ్మణ్యం, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు దాతల ప్రోత్సాహం



చల్లపల్లి: పురిటిగడ్డలోని జెడ్పీ హైస్కూల్ ప్లస్ జూనియర్ కళాశాల విద్యార్థినులను దాతలు ప్రోత్సహిస్తూ సాయం అందచేశారు. మచిలీపట్నానికి చెందిన చల్లపల్లి రాజేశ్వరి కళాశాలలోని ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ చదువుతున్న విద్యార్థినులకు రూ.35 వేల వ్యయంతో యూనిఫాం, స్టడీ మెటీరియల్, రికార్డ్ బుక్స్‌ను పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని జంపాన చంద్రిక ద్వారా అందజేశారు. అనంతరం వేసవి శిక్షణ తరగతుల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.